# ధన్యజీవులు

శ్రీమతి
ఆయుపెల్లి
రామలక్ష్మి

హరిజనులు అస్పృశ్యులు కారు. వారూ మానవులే, వారు మన సోదరులు. వారు కష్టపడి చెమటూడ్చి పండించు ధాన్యాదులు మనము తినవచ్చు, వారిచ్చు పండ్లు ఫలాదులు మనం తినవచ్చు. కాని, వారిని తాకకూడదా? అస్పృశ్యత?-ఏ కౌటిల్యము దీని నేర్పరచింది?

శంకరం అప్పుడే కాఫీ త్రాగి వీధిలోకి వచ్చేడు. మాలవెంకడు ఎదురుగుండా ఏడుస్తూ వచ్చి నమస్కారంచేసి,

'బాబూ, రక్షించాలి, చచ్చిపోతున్నాది బాబు' అన్నాడు. శంకరంగారు 'ఏంరా? ఏమిటి ప్రమాదం వచ్చింది? చెప్పు వేగిరంగా'

'బాబూ నాభార్యకు వారంరోజులబట్టి జ్వరం వస్తున్నాది. గర్భిణి బాబూ. యీరోజున ఉష్ణం హెచ్చింది. తమరొకసారి దయచేసి యీ దీనుణ్ణి రక్షించాలి. బాబూ' అన్నాడు శంకరం పాదాలమీదపడి.

శంకరం వాడినిచూడగానే అతని జాలిగుండె వెన్నవలె కరిగిపోయింది. యిక వాడి ఏడ్పు వినలేక వెంకడిని లేవనెత్తి భయంలేదని చెప్పి తీసుకెళ్లేడు.

వెంకడి సంతోషానికి మేరలేదు. శంకరం రోగిని పరీక్షించి మూడుమోతాదు లిచ్చాడు. వాటి అనుపానము ముగ్నగునవికూడ చెప్పి, 'యింకభయములేదురా, ఒకవారం రోజులకల్లా పురుడు వస్తుంది' అని చెప్పి వెళ్ళిపోయేడు. వెంకడు తన కృతజ్ఞతను చూపుతూ నమస్కరించాడు.

శంకరం వెంకటశాస్త్రికి ఒకడే కొడుకు. బి. ఏ. పాసయ్యాడు. కాని యిప్పటికాలంలో ఉద్యోగ మెవరిస్తారు? ఏ కోమటికొట్టు దగ్గరన్నా ఉద్యోగము దొరకుతే వారిచ్చిన పదిహేను రూపాయిలకు వారుచెప్పిన పనులు చెయ్యడం, తిట్లు, తన్నులుతినడం! అటువంటి ఉద్యోగాలు చెయ్యడం శంకరాని కిష్టం లేదు. తనపూర్వీకుల దగ్గరనుండి వస్తూన్న వైద్యం నేర్చుకున్నాడు. వెంకటశాస్త్రి పూర్వాచార పరాయ

ణుడు. పిత్రార్జితమైన మాగాణీవల్ల సాలుకి రూ 1500 వస్తాయి. శంకరానికి మేనరికం చేసేరు. 'గంతకు బొంతన్నట్లు' సరళ శంకరానికి తగ్గా ఉంది. నవనాగరికురాలు, జాలి, దయ, ప్రపంచానుభవము కలది.

వెంకడు మాలపల్లి కంతటకు పెద్ద. ఆ మాలలందరు అతనిమాట శిరసావహిస్తారు. వెంకడు శాస్త్రిగారి పొలందున్నుతూ దానివల్ల వచ్చే ధాన్యపుగింజలవల్ల జీవిస్తున్నాడు.

శంకరం మాలపల్లికివెళ్లి వెంకడికి మందిచ్చేడన్న సంగతి ఆ మర్నాడే ఊరంతా పాక్కిపోయింది. కొందరు సనాతనులు శాస్త్రిగారిని హెచ్చరించారు. కొందరు నవనాగరికులు శంకరాన్ని పొగిడేరు. ఆ రోజునే శాస్త్రి కొడుకును పిలిచి,

'ఏంరా? అబ్బాయీ, నువ్వు నా పరువు తీస్తున్నావు. బ్రాహ్మణీకాన్ని మంటగలుపుతున్నావు! ఆ కిరస్తానీ చదువులు చదివించనంటే మీ అమ్మ శతపోరుపెట్టింది. నువ్వు మాలపల్లి వెళ్లటం నిజమేనా??'

శంకరం:. 'నాన్నగారూ, నేను మాలపల్లి వెళ్లడం నిజమేను. నేనుగాని అప్పుడు వెళ్లకపోయినట్టయితే ఆ నిండుమాలాలి గతేమికాను? వాళ్లనంటుతే వచ్చిన నష్టమేమిటి? వాళ్లూ మనలాటి మానవులే, హృదయముకలిగి, కూడుతిని గుడ్డ కట్టవలసినవారే. ఏ శాస్త్రములో మాలవాళ్లు అంటరానివారని ఉన్నదో చెప్పండి. పురాణేతిహాసములు కూడా హరిజనులు అస్పృశ్యులని చెప్పలేదు. మహారామాయణ గ్రంథము రచించిన వాల్మీకిమహాముని పంచముడుకాడా? శ్రీరామునికి తండ్రివంటివాడును, గురువును అగు వశిష్టుడు హరిజన స్త్రీయైన అరుంధతిని వివాహమాడలేదా? మన మనుధర్మశాస్త్రములో నాల్గు వర్ణములే ఉండెడివి. కాని క్రమేపి ధనవంతులు షడ్రసోపేతంగా భుజించుచు ధనమదాంధులై, శరీర పరిశుభ్రతలేక గంజినీళ్లు త్రాగి బ్రతికినవారిని అస్పృశ్యులనియు, కడజాతివారనియు అనిరి. అటువంటివారికి సహాయముచేయుటే మనవిధి. వారిని, నీచదశనుంచి తొలగించి వారికి కావలసిన సౌకర్యములు ఒనగూర్చుటకు నేను కంకణము కట్టుకొంటిని'

శాస్త్రి :-శంకరం! యిదే నీకుఆఖరుసారి చెప్పటం. ఆ మాలలను మనమంటరాదు. అవి మన పూర్వీకులు చెప్పిన వాక్యములు. వాటిని మనం అక్షరాలా జరిపించి తీరవలయును. నువ్వు యిక ఆ వ్యాపారమును కట్టిపెట్టు. అట్లుకానియెడల నిన్ను నా యింట్లో వుంచకపోవడమే కాకుండా నా ఆస్తిలో పీసమంతయినా నీకు చెందనివ్వను.

శంకరం:-నాన్నగారూ, మీఆస్తి, యిల్లు నాకవసరములేదు. నాకు నా సోదరులే ఆస్తి. వారిచ్చు పాకయే నాకు యిల్లు. వారు కష్టపడి చెమటూడ్చి పండించు ధాన్యాదులు మనము తినవచ్చు, వారిచ్చుపండ్లు ఫలాదులు మనం తినవచ్చు. కాని, వారిని తాకకూడదా? మీరు నన్ను యీ విషయములో క్షమించాలి. యిప్పుడే మీయిల్లువిడిచి పోతున్నాను' అంటూ శంకరం తండ్రికి నమస్కరించి తల్లిదగ్గరకు వెళ్లేడు.

వెంకటశాస్త్రి పండ్లు పటపట కొరుకుతూ 'దుర్మార్గుడా! తండ్రిమాట విననివాడు కొడుకా? యీక్షణమందే, నా కీజన్మలో నీమొగము కనపర్చకుండా, పో!'అని గర్జించెను.

శంకరం, తల్లి వారిస్తున్నాగాని వినకుండా, బయలుదేరేడు. సరళకూడా వెళ్లటానికి సిద్ధమయింది. అత్తగారు ఆమెచెయ్యిపట్టుకొని వెళ్లవద్దనిచెప్పింది. కాని సరళ 'అత్తగారూ, నాకు దేవుడైన నా భర్తను

విడిచి నేనుండలేను. నా పతిచరణములే నాకుగతి' అని నమస్కారముచేసి పట్టువిడిపించుకొని తనభర్తవెనకాల బయలుదేరింది. శంకరం తిన్నగా మాలపల్లెవైపు వెళ్ళేడు. యీ సంగతి మాలపిల్లలకి తెలిసింది. అందరూ తలో కర్ర పట్టుకొని బ్రాహ్మణవీధి వస్తుండగా, శంకరం వారిని శాంతివచనాలతో, తిరిగి పంపించాడు.

శంకరాన్ని, అతనిభార్య సరళని మాలజనమంతా తమపల్లెకు తీసుకొనివెళ్లారు. అందరూ పళ్లు, ఫలములూ, పాలు వారు వద్దనినను తెచ్చియిచ్చేరు. ఆ మర్నాడే ఆ ఆనంద దంపతులకు అచ్చట ఒకపాక వేయబడినది. శంకరం తనకుటీరంప్రక్కనే మరొకపాక వేయించి ఒక బడి స్థాపించాడు. దానిలో స్త్రీ బాల వృద్ధులుకూడా ప్రవేశించారు. శంకరం వారందరకు ఆరోగ్యవిధులగురించి, గాంధిమహాత్ముని తత్వోపదేశము గురించి ఉపన్యాసాలిస్తూఉండేవాడు. అచ్చట కొన్ని రాట్నాలు పెట్టేడు. స్త్రీలు వృద్ధులు నూలువడుకుతూ కాలక్షేపంచేసేవారు. బాలురు వ్యాయామపరిస్థితులందు, చదువుయందు, కాలక్షేపంచేసేవారు. సరళ స్త్రీలకు గృహాలంకారముగురించి చెప్పి వారివారి గృహములను పరిశుభ్రముగను, ఆరోగ్యవంతముగాను, తయారుచేయించింది. వారికి శిశుపోషణగురించి చెప్పింది. శంకరం మాలపల్లినంతటను శుభ్రముగా చేయించాడు. వారిచే కల్లు మాన్పించాడు. వెంకడు తనకు కలిగిన కొడుకును శంకరయ్యా అని పిలిచేవాడు.

వెంకటశాస్త్రి, శంకరం వెళ్లిపోయిన దగ్గరనుంచీ, నీరసించిపోయేడు. క్రమేపి అది జబ్బులోకి దించింది. మంచంపట్టిపోయేడు. తన మూర్ఖపు పట్టుదల వదిలేసుకున్నాడు. శంకరాన్ని పిలిపించి దగ్గరగా తీసుకొని 'నాయనా, ఆఖరికి నీ పంతమే నిల్చింది. హరిజనులు అస్పృశ్యులుకారు. వారూ మానవులే, వారు మనసోదరులు. ఏ శాస్త్రములో చూచినా హరిజనులు అస్పృశ్యులు కారనే చెప్పబడ్డది. మొదట అది గ్రహించుకోలేకపోయాను. హరిజనులకు తగిన సేవచేస్తూ హాయిగా కాలక్షేపంచెయ్యి'అని వెంకట శాస్త్రి చెప్పి, తనప్రాణాలను అనంతవాయువులో ఐక్యముచేసేడు.

శంకరం తండ్రికి చేయవలసిన యథాక్రియలు నెరవేర్చేడు. తనకు సాలీనావచ్చే ధనములో కొంత ఖర్చుపెట్టి హరిజన సంఘమును స్థాపించేడు. తనయింటికెదురుగా ఒకచావిడి కట్టించేడు. దానిలో రాట్నముల మీద నూలువడికించేవాడు. తనభూములలో ప్రత్తి వేయించేవాడు. యిప్పుడు ఏ మాలను చూచినా శుభ్రముగను ఖద్దరుకట్టినవాడై కనుపిస్తాడు. ఆ ధన్యజీవులు ఆగ్రామములోనే కాకుండా ఆ చుట్టుప్రక్కల గ్రామాల్లోను హరిజనులకు రైతులకు ఆదర్శప్రాయులైయ్యారు. శంకరం రైతుల బాధలనుకూడ నివారణ చేసేవాడు. ఏ కలహమొచ్చినా శంకరమే తీర్పుచెప్పాలి. ఎవరికే జబ్బువచ్చినా శంకరమే మందుయిచ్చేవాడు. ఆ వూళ్లోవున్న కొందరు సనాతనులు శంకరాన్ని అతని కుటుంబమును వెలివేశామన్నారు. కాని శంకరం సరళ వారిమాటలకు జడియక తమ జీవితాల్ని తమ సోదరుల సేవక్రింద వ్యయపరస్తూ ధన్యజీవులయారు.

